క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెదపూడి: పుష్య మాసం దశమి శనివారం సందర్భంగా సంపర వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో విశేష పూజలు చేశారు. అర్చకులు ఖండవిల్లి హనుమంతాచార్యులు శనివారం ఉదయం స్వామివారికి తులసి పూజ, పంచామృతాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులచే గోవిందనామ స్మరణ చేయించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి జాతర



కత్తి కుండను శిరసున ధరిస్తున్న మహిళ

అనపర్తి: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా గ్రామంలో భక్తుల పూజలందుకుంటున్న మండలంలోని కొప్పవరం గ్రామ దేవత సత్తెమ్మతల్లి జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. రెండేళ్ల క్రితం జరిగిన జాతరలో భక్తులు పూజలందుకున్న కత్తి కుండను శనివారం సాయంత్రం అమ్మవారి సన్నిధి నుంచి కిందకు దింపడంతో జాతర ప్రారంభమైంది. తొలిరోజు వందలాది మంది భక్తులు అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. సంతానం లేని దంపతులు కత్తి కుండను శిరసున ధరిస్తే సంతాన ప్రాప్తి, భక్తులు కోరిన కోర్కెలు నెరవేరుతాయని విశ్వసిస్తారు. అమ్మవారి జాతర సందర్భంగా పలువురు ప్రముఖులు, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

మధురపూడి: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో భాగంగా కోరుకొండ మండలం దోసకాయలపల్లి హైస్కూల్ క్రీడా మైదానంలో శనివారం క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. కాపవరం జట్టుపై కోరుకొండ-2, జంబూపట్నంపై కణుపూరు, నర్సాపురంపై మధురపూడి, శ్రీరంగపట్నంపై బూరుగుపూడి విజయం సాధించారు. మంగళవారం ఫైనల్స్ జరుగుతాయి. ఈ పోటీలను వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షిస్తున్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



రఘుదేవపురం ఎంపీపీ స్కూల్లోని పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో చైత్రవర్షిణి

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంక, జాలిమూడి, కాటవరం, మునికూడలి, వెదుళ్లపల్లి, రాజంపేట, ఇనుగంటివారిపేట, ముగ్గళ్ల, రఘుదేవపురం, సీతానగరాల్లోని 30 పోలింగ్ బూత్‌లను శనివారం రాజమహేంద్రవరం ఆర్డీవో ఏ.చైత్రవర్షిణి పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో తాగునీటి సదుపాయం, విద్యుత్, మరుగుదొడ్లు, లైటింగ్, ఫ్యాన్లు తదితర వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన పోలింగ్ బూత్‌లను తక్షణమే పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కృష్ణారావుకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మి, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

భూమికి సారం.. రైతుకి ఆదాయం

- పచ్చిరొట్టతో పుడమికి మేలు
- రసాయన ఎరువులు తగ్గించుకునేందుకు మార్గం

రంగంపేట: రసాయన ఎరువుల వాడకం విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో భూసారం క్షీణిస్తోంది. దాని ప్రభావం తరువాత సాగు చేసే పంటలపై పడి దిగుబడులు తగ్గుతున్నాయి. దీంతో దిగుబడులు పెంచుకునేందుకు రైతులు మరిన్ని రసాయన ఎరువులు వాడుతుండటంతో భూసారం మరింతగా దిగజారిపోతుంది. భూమిలో సారం పెంచుకునేందుకు రైతులు రబీ పంటల అనంతరం చేలల్లో పచ్చిరొట్ట పైరును పెంచడం ఎంతో మేలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. తద్వారా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవడానికి వీలుంటుందంటున్నారు. వరి కోతలు పూర్తయిన తరువాత పలువురు రైతులు అపరాలను సాగుచేస్తుంటే మరికొందరు అధికారుల సూచనతో పచ్చిరొట్టను సాగు చేస్తున్నారు.

స్థూల పోషకాలు అధికం

పంట పంటకు మధ్యలో పచ్చిరొట్ట పైర్లను పెంచడం వలన భూసారం బాగా పెరుగుతుంది. జనుము, జీలుగ, పిల్లి పెసర, ఉలవ తదితర రకాలను రబీకి, ఖరీఫ్‌కు మధ్య సాగు చేసుకోవాలి. వీటిని పూత దశ వరకూ పెంచి ఖరీఫ్ పంట వేసే ముందు భూమిలో కలియదున్నాలి. పచ్చిరొట్ట పైర్లలో స్థూల పోషకాలు అధికంగా ఉంటాయి. నత్రజని 1.8 శాతం నుంచి 3.5 శాతం, భాస్వరం 0.1 శాతం నుంచి 0.3 శాతం, పొటాష్ 0.5 శాతం నుంచి 2 శాతం వరకూ ఉంటాయి. స్థూల పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా భూమికి లభిస్తాయి. పంటల ఎదుగుదలకు అవి ఎంతో కీలకం. తద్వారా నేలలో సంపూర్ణమైన ఉత్పాదకత పెరుగుతుంది. భూమి లోపల నిక్షిప్తమైన పోషకాలను ఈ పైర్లు వెలికితీస్తాయి. ఈ పైర్ల సాగు వల్ల 30 శాతం రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. రైతులు ఆర్థికంగా లాభపడడానికి పచ్చిరొట్ట పైర్లు దోహదం చేస్తాయి. ప్రస్తుతం ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్న పరిస్థితుల్లో పచ్చిరొట్ట పైర్ల సాగుతో ఎంతో మేలు జరుగుతుంది.



రంగంపేటలో సాగు చేస్తున్న పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగించే నేపియర్ గడ్డి

గుళికలతో నశిస్తున్న సూక్ష్మజీవులు

వరి కోతల అనంతరం చేలల్లో పదును ఉన్న సమయంలోనే పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుంటే భూసారానికి ఎంతో మేలు చేకూరుతుంది. ఖరీఫ్, రబీ పంటల్లో రైతులు గుళికలను అధికంగా వాడటం వల్ల భూమి లోపల సూక్ష్మజీవులు నశించిపోతున్నట్టు శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. గతంలో ఒక గ్రాము మట్టికి కోట్లాది సూక్ష్మజీవులు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య లక్షల్లో పడిపోయినట్టు పరిశోధనల్లో తేలుతోంది. పంటల పెరుగుదలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు నశించడం వల్ల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. పచ్చిరొట్ట పైర్లను భూమిలో కలియదున్నడం వలన తిరిగి సూక్ష్మజీవులు అభివద్ధి చెందే అవకాశముందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. సహజంగా చౌడుబారిపోయిన భూముల్లో జీలుగు వేసుకుంటే భూమి భూసారం పెరిగి పంటకు అనుకూలంగా మారుతుంది.

పచ్చిరొట్టతో భూసారం పెరుగుతుంది



పచ్చిరొట్ట వేసుకుంటే భూసారం పెరిగి అధిక దిగుబడులు రావడానికి దోహదపడుతుంది. కోతలు పూర్తయిన తరువాత పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకునేందుకు అనువుగా ఉంటుంది. పచ్చిరొట్ట విత్తనాలు ప్రతి గ్రామంలోని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. కావాల్సిన రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించాలి.

– కె.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి, రంగంపేట

స్వామిత్వ సర్వే నిబంధనల ప్రకారం చేపట్టాలి



పైన గ్రామంలో సర్వేను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: స్వామిత్వ సర్వేను నిబంధనల ప్రకారం చేపట్టాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అధికారులకు సూచించారు. పైన గ్రామంలో శనివారం ప్రారంభించిన స్వామిత్వ సర్వేను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేను రోవర్ మిషన్‌తో చేస్తారన్నారు. దీని ద్వారా ప్రతి గృహాన్ని కొలతల ప్రకారం సర్వే చేసి, సర్వే కరెక్ట్‌గా ఉంటే ఆ ఇంటి యజమాని సంతకం తీసుకుని సాధికారిత భూశాశ్వత హక్కు పత్రం అందజేస్తారన్నారు. సర్వేలో ఏదైనా ఇంటి సరిహద్దు, ఇతర కొలతలు తప్పుగా ఉంటే అధికారుల సమక్షంలో వాటిని సరిచేస్తారన్నారన్నారు. ఎలాంటి దస్తావేజులు లేని, సరిహద్దులు సక్రమంగా లేని ఇళ్లకు నూతనంగా ఇంటి భూహక్కు పత్రాలు అందజేయడానికి ఈ సర్వే దోహదపడుతుందన్నారు. సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి గౌతమి చంద్ర, సర్వేయర్ ధనుష్, డిజిటల్ అసిస్టెంట్ సాయిలక్ష్మి, మహిళా పోలీస్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పాశాలమ్మ జాతర

- అంగరంగ వైభవంగా ఊరేగింపు
- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



పాశాలమ్మవారి రథం వద్ద ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం గ్రామ దేవత పాశాలమ్మ జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అమ్మవారిని దర్శించుకున్నారు. ఊరేగింపు సందర్భంగా రథం వద్ద కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీని అభినందించారు. ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని తెలిపారు. ఇప్పటికే ఆలయం వెనుక కల్యాణ మంటపం నిర్మాణం కోసం రూ.10 లక్షలు గ్రాంటు ఇవ్వడం జరిగిందన్నారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా కొంత స్థలాన్ని కూడా కేటాయించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జాజుల రాము, ఉత్సవ కమిటీ నాయకులు కాలచర్ల పెద్దకాపు, తగరంపూడి దుర్గారావు, కాలచర్ల గోవిందు, గుగ్గిలం రవి, వైఎస్సార్ సీపీ నాయకులు కాలచర్ల చిన్నారావు, కాలచర్ల శివాజీ, ఎంపీటీసీ సభ్యుడు కాలచర్ల నాగు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తో గ్రామ స్వరాజ్యం సాకారం



ముకుందవరంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ముకుందవరంలో రూ.43.60 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయం, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా, రూ.20.80 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ల భవనాలను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టగానే సచివాలయాలను తీసుకొచ్చి ప్రజల ముంగిట్లోనే సకల సేవలు అందేలా చేశారన్నారు. ఆర్బీకేలను ప్రవేశపెట్టి వ్యవసాయాన్ని పండగ చేశారని చెప్పారు. పేదలకు అన్నివిధాలా మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీకోఆప్షన్ సభ్యుడు లంక చందన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, అనపర్తి ఏఎంసీ వైస్ చైర్మన్ ఆడబాల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- రామవరంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభం



రామవరంలో సీసీ రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: గ్రామాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు నియోజకవర్గం అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని రామవరం కాలనీలో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాలకు సమాన ప్రాధాన్యతనిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్ల కాలంలో రామవరం గ్రామానికి కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేసి గ్రామాన్ని అభివృద్ధిలో అగ్రపథాన నిలిపామన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలిచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, రామవరం ఉపసర్పంచ్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రామవరం సర్పంచ్ గిరడా గంగాభవానీలు మాట్లాడుతూ నిధులు మంజూరు చేసి రామవరం గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అంతకుముందుగా రామవరం కాలనీలో జలజీవన్ మిషన్ నిధులు రూ.28.40 లక్షల వ్యయంతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు, గ్రామ పంచాయతీ, మండల ప్రజాపరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.26.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, ఎంపీటీసీలు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి, కొప్పవరం, గంగ్రేడు సర్పంచ్‌లు కర్రి బుల్లిమోహన్‌రెడ్డి, కుడుపూడి శ్రీనివాస్, సత్తి సూరారెడ్డి బ్రదర్స్, మేడపాటి వాసు, పంచాయితీ పాలకమండలి సభ్యులు కోరాడ నాగదేవి, నల్లమిల్లి వరలక్ష్మి, కర్రి రామచంద్రారెడ్డి, కర్రి రుక్మిణికుమారి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



పుణ్యక్షేత్రంలో ఎంపీటీసీ సభ్యుడు పలివెల వెంకట్రావును పరామర్శిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: నియోజకవర్గంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి శనివారం పరామర్శించారు. రాజానగరం మండలం కొండగుంటూరుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఉగ్రింకల శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామంలోని తంబాబత్తుల వెంకటేశులు, కత్తి కృష్ణారావు, రేలంగి పుత్రయ్య, గిరిజాల మంగియమ్మ, తమ్మరబోయిన లక్ష్మి కుటుంబ సభ్యులను ఓదార్చారు. భార్య వియోగంతో బాధపడుతున్న జి.యర్రంపాలేనికి చెందిన పల్లేటి నాగేశ్వరరావు, పుత్రశోకంలో ఉన్న మారంపూడి ఏసురత్నాలను పరామర్శించారు. భార్య వియోగంలో ఉన్న పుణ్యక్షేత్రం ఎంపీటీసీ సభ్యుడు పలివెల వెంకట్రావును పరామర్శించారు. కోరుకొండ మండలం గుమ్ములూరుకు చెందిన మరుకుర్తి నరసయ్యమ్మ కుటుంబ సభ్యులను కలిశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ వీరన్న చౌదరి

సీతానగరం: పుట్టబోయే బిడ్డ నుంచి వృద్ధుల వరకూ కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని రాజానగరం నియోజకవర్గం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి అన్నారు. మునికూడలి, వెదుళ్లపల్లి గ్రామ సచివాలయాల్లో శనివారం కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 114 సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని, అందులో 20 పథకాలను రాష్ట్ర ప్రజలు వినియోగించుకుంటున్నారన్నారు. వికసిత్ భారత్ యాత్రలో భాగంగా వ్యాన్ ద్వారా గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఖండవల్లి సాయి, సాంబేలపు బాలయోగి, సత్యం రామకృష్ణ, నరేష్, సుభాష్ పాల్గొన్నారు.

కోరుకొండ మాజీ సర్పంచ్ మృతి



భాస్కరరావు (ఫైల్)

మధురపూడి: కోరుకొండ మాజీ సర్పంచ్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వినుకొండ భాస్కరరావు (75) శనివారం హైదరాబాద్‌లో కుమారుడి ఇంటి వద్ద మృతి చెందారు. ఆయన ఉపాధ్యాయుడిగా అనేక మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల గ్రామంలో సారా విక్రయిస్తున్న వాకా దుర్గను అరెస్టు చేశామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) సీఐ జి.సత్యనారాయణ తెలిపారు. ఆమె ఇంటి వద్ద సారా విక్రయిస్తుండగా దాడి చేశామన్నారు. ఇంట్లో ఉన్న 25 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.